
# వారం వారం కథాప్రభ



సుమిత్ర బడి నుంచి పరుగున వచ్చింది. వీపున మోపెడు పుస్తకాలున్నాయి. గుడిసెలోకి తొంగి చూసింది. అమ్మ కనిపించలేదు. గడపెంట కూర్చుని జోగుతున్న తాత నడిగింది. 'పొద్దుగూకింది అమ్మేది తాతా?' అని.

ఈ తాత సుమిత్రకు తాత కాదు. న్యాయానికి వాళ్ల అమ్మకూ కాదు. అక్కడున్న ఇరవై గుడిసెలకు మాత్రం 'తాత.'

తాత వయస్సు తొంభై పైనే. నూరు అయినా విచిత్రమేం లేదు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ లేడూ? ఆయన విమాన ప్రమాదంలో అప్పుడు పోయాడు గదా! అప్పటికే తాతకు పెళ్లయింది. అదీ ముదిరిన బెండకాయ స్థితిలో - తాత పెళ్లాం ఈయనతో పస్తులుండలేక చెప్పా చెయ్యకుండా ఎటో లేచి పోయింది. పాపం ఆవిడ పదేళ్లు కాపురం చేసిందట ఓపికగా.

తాత కంటే ముందు వయస్సు పిటపిటలో ఓ పోరణ్ని పెళ్లాడిందట. రాళ్లేత్తేకాడ రాయి పడి పచ్చడయిపొయ్యాక దిక్కూ దిశా కనిపించలేదట. పుట్టినోళ్లకాడిని పోవయితి లేదు. ధైర్యం చేసి కూలి పనికెళ్లింది.

మగ దిక్కులేనిదని తెలిశాక, అదీ వంటికి వయసున్నాక అదెంత కష్టమో వారం తిరక్కముందే తెలిసిపోయింది.

ఇద్దరు రిక్షావాళ్లూ... ఆ వాడ నాయకుడూ. ఒకనాడు అపరాత్రి గుడిసెకొచ్చారు. తలుపు

# అడవి - చాకా శివకోటి

తట్టారు. తీసింది. లోపలికొచ్చారు. నోట్లో గుడ్డలు కుక్కి తమ పని తాము పూర్తి చేసుకుని వెళ్లిపోయారు.

అప్పుడొచ్చింది తాత దగ్గరకు. 'ఇక నీతోనే ఉంట' అని ఏడ్చింది.

అట్టనే ఉండు' అన్నాడు తాత. జాలిపడ్డాడు. అడుక్కునేందుకు మంచి సెంటరు చూపిండు. అది మొదలు బండి సజావుగానే నడిచింది.

నాలుగు నెలలయింది. ఒకనాడు తాత పిలిచిండు. ఏందట' అంటూ వచ్చింది.

"ఓ ఊసు చెప్త ఇంటవా?" అన్నాడు. తలూపింది. మనం ఇడిగా ఎందుకు ఆలు మగలవుదమేం" అన్నడు.

బిత్తరపోయింది మొదట.

"ఇక్కడ నుంచి ఎటుపోను?" అనుకుంది. ఎటూ రాబందులే కనిపించాయి. శవంలా తలూపింది.

ఆ రాత్రే తాత గుడిసెకి మారింది. ఆడి పక్క ఎక్కింది. గుండెల్లోకి జరిగింది.

"బాగున్నవు" అన్నాడు తాత. తగులుతున్న వెచ్చదనానికి.

"సర్లేగానీ, నాకిప్పుడు నాలుగో నెల.

"ఇప్పుడే గద నా పక్కలో కొచ్చింది? అప్పుడే నాలుగో నెలేంది? నీ ఎర్రి మొఖంగాల" అన్నాడు గరగర నవ్వుతూ.

"నీ తానకొచ్చేముందు నన్ను ఆగం జేసి్రని చెప్తిగదా! ఆ పాపమేమో? ఇగో, నెల కింద అర్థమైంది. పోతె బాగనుకున్నా. పోయెటందుకు ధర్మాసుపత్రిల అయిదు నూర్లడిగ్రను. ఏడుపు ఆగలా. ఏడ్చిన. ఎంతసేపయినా సుఖంగ ఏడ్వబుద్దయింది. కానీ అడుక్కొనడం మానేస్తె ఎట్ట? పస్తులు మొదయితయి గదా. అందుకే ఏడుపు నాపిన. సెంటరుకెళ్లి అడుక్కున్న. ఆనక ఏడుపు రాలేదు."

మెలికలు తిరిగిపోయి నవ్విండు తాత.

నాకు అర్థంగాలేదు. ఎదురుగా జరుగుతున్నా మనకు సానా అర్థంగావు.

"కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకట! నేనెంత అదృష్టవంతుణ్నే. మనుగుడుపు నాటికే నాల్గు నెలల బిడ్డను మోస్తుండడం మామూలా ఏంది?" అన్నడు దగ్గరికి జరుపుకుని. మగబిడ్డ కల్గిండు. ఆడి తండ్రెవడని తాత ఎన్నడూ అడగలేదు. ఒకవేళ అడిగినా ఆమెకు మాత్రం ఏం తెలుసు?

పోరడికి పన్నెండేళ్లు వచ్చినయి.

తాత పోరణ్ని తన బిడ్డె అని సాకాడు.

చదువుకు తోలిండు. ఈడికి అబ్బలేదు.

జులాయిగ అయిండు.

ఇంతలో దీనికి ఒంట్లో జబ్బు కూడింది.

మందులకూ, తిండికీ, ఈ పోరడికీ డబ్బేడ తెస్తది.

మందులు మానేసింది. జబ్బు ముదిరింది.

ఒకనాడు నడవను కూడా నడవలేకపోయింది. లాభం లేదనుకుని ధర్మాసుపత్రికి నడిచింది. "మూడు వేలుంటే బతుకుతవు. లేకపోతే రెండు నెలల్లో ఖతం" అని చెప్పి్రను.

ఈ మాట పోరడి చెవిన పడ్డది. డబ్బుకోసం ఆడు గుడిసినొదిలిండు.

సంపాదన లేదు గద. తాత మీద పడడం తప్పు అనుకుని దూరంగా ఎల్లిపోయిండు.

దానికోసం తాత మాలావు ఇదిగ వెతికిండు.

ఇంతలో ఈ పోరడేమో లారీ కిందపడి కాలు పోగొట్టుకున్నాడు. ఆసుపత్రిల ఉన్నడంటే ఆడికి చేరిండు తాత.

తాతను చూసి నవ్విండు పోరడు.

"ఏందిరా ఇదీ" అని కంట తడిపెట్టుకుండు తాత. తల నిమిరిండు ఏడుస్తూ.

కూసేపు ఆగినంక తాతను జూచి 'అయ్యా!' అన్నడు.

"ఏందిరా బిడ్డా! చెప్పు."

అమ్మకు జబ్బు చేసిందే. దానికి మూడేలు కావాల్నట. మనకు డబ్బొత్తదే. నువ్వు కూస్త దానికి నయం జేయించు" అన్నడు.

"పిచ్చిగాని పట్టలేదుగదా ఈడికి" అని గిచ్చి చూసి "డబ్బేడిదిరా. ఎటునుంచి వస్తది?" అని అడిగిండు తాత.


"లారీ కిందనో, బస్సుల కిందనో, కార్ల కిందనో పడితే - కాలో చేయో ఇరుగుతది కదా! అప్పుడు ఇన్సూరెన్సు వోళ్లంట బోలెడు డబ్బిస్తరట. వకీలు గుమస్త చెప్పిండు" అన్నాడు ఆశగా.

"ఇదేందిరయ్యా! ఈ తిరకాసేందో నాకు సమజయిత లేదు" అని కళ్లు తుడుచుకుండు.

"అదేంలేదే. నువ్వు బేఫికరుగ ఉండు. ఇట్టాంటి కేసుల కోసం ఆడు ఎతుకుతుంటే నేను పడి, ఆడికి కేసిచ్చిన. అంత రాసకపోయి్రను. మనకు ఎట్టలేదన్న పదేను వేలొస్తయ్. అమ్మ జబ్బు నయమవుతది. అందరం సుఖంగ బతకొచ్చు. ఏమంటవు?" అన్నాడు.

తాతకి ఏడవాల్నో నవ్వాల్నో తోచలేదు. కాని ఒకటి అర్థమైంది. "వకీలు గుమస్తా మాట విని వాడు తనంతట తానే లారీ కింద పడ్డడు" అని.


ఇది అర్థమయినంక తాతకు ఏడుపు ఆగలేదు.



ఏడుస్తనే గుడిసెకు పోయిండు. ఇట్ట వారం దిరక్కముందే ధనుర్వాతమొచ్చి పోరడు పోయిండు. చచ్చేటప్పుడు కూడా వాళ్ల అమ్మనూ, వకీలు గుమాస్తాను మరవలేదు. ఆడు రాను లేదు. పోరడు ఇట్టా చచ్చిపోనాడని చెపుదాన్నా తల్లి కనపడలేదు. అదేడ ఉండదో, ఏమో?

అమ్మ వైద్యానికి వీడు చచ్చిండు గదా! అంతమటుకు బాగనే ఉంది కానీ, ఈడ్ని ఆసుపత్రి నుంచి బయటకు తెచ్చి పూడ్చి పెట్టేసరికి తాత అయిదేళ్ల కష్టార్జితం కరిగిపోయింది.

అప్పుడు పోరడ్నీ, తల్లిని తలచుకుంటే కళ్లెంట నీరు కూడా రాలేదు తాతకు. ఆ అమ్మా బిడ్డలపైన ఒకరికొకరికి ఉన్న ప్రేమ గుర్తుకొస్తే మాత్రం -




తాత గుండె చెరువయ్యేది. కన్నీటితో గుడ్డ తడిసిపోయేది.

"సుమిత్రవా తల్లీ! రా" అని వచ్చావు గదా. అమ్మ మాటంటావా? వస్తది. మధ్యన యాడ ఆగిందో?" అన్నాడు తాత.

పుస్తకాలను కిందపడేసి తాత దాపుకొచ్చింది. వాడి ఒళ్లో అరకొరగా కూర్చొని "ఇయ్యాల్టిదాకా ఉండకపోతే ఏం?" అంది.

"ఎనక వచ్చే ధర్మాత్ముడెవడేనా చెయ్యి విదిలిస్త డేమోనని ఆశ గద తల్లీ! నేను తెచ్చుకుంది నాకు సరిపోతది గదా. అది అసలు వచ్చినా నీకోసమే గదా! నేను ఇక్కడనే ఉంటానని దాని ధైర్యం" అంటుండగనే సుమిత్ర తల్లి గుడిసెలో కొచ్చింది.

"ఇది పురిటిబిడ్డతో వచ్చిననాడు పేరు చెప్పలేదు. 'బిడ్డా' అను అంది. అంతే!" అని కళ్లు తుడుచుకున్నాడు.

సుమిత్ర కిప్పుడు ఆరేళ్లు. వీధి బళ్లో చదువుతూంది.

సుమిత్ర వచ్చీ రావడంతోనే కిర్సనాయిలు దీపం వెలిగించింది. గోనెపట్టను దులిపి సరిచేసి కూర్చుంది. ఒడిగుడ్డను పట్టపైన దులిపింది. చిల్లరపైసలన్నీ దానిపై పడినయి. ఒక్కొక్కటే ఏరి లెక్క పెట్టింది. తిరిగి కుప్ప చేసింది. పద్నాలుగు రూపాయల నలభై పైసలున్నాయి. చెల్లని పావలా ఒకటుంది. వాటిని భద్రంగా కొంగున ముడేసి "అమ్మా! చదువుకో" అంది.

"అన్నం వండావా?" అంది సుమిత్ర.

"నువ్వు చదువుతూ కూర్చో వండి పెడత" అంది - వెంటనే లేచింది. వంట పనిలో జొరబడింది.

'చదువో, చదువో అని చంపకే. చదువుకుని సంక నాకడానికి కూడా పనికిరాకండా తిరుగుతున్నరూ!" అన్నాడు తాత.

"ఇదిగో నువు గారాం చెయ్యకు. దాన్ని చదువుకోనీ" అంది అరచినట్టు.

"ఓసి పిచ్చిమొఖమా! చదువు మనకెందుకే? గొప్పోళ్లకు కావాల. ఆడి ముల్లెలు నింపాల. ఇగో మనం అందరం చదివామే అనుకో! ఉపయోగమేంది? ఉపయోగించుకునేవాడెవడు? అట్టాంటి అండ మనకేడ దొరుకుతది?" అని నవ్విండు.

"పిచ్చి పిచ్చి మాటలు చెప్పకు. దానికి చదువుపై శ్రద్ధ తగ్గేలా చేయొద్దు?" అంది కోపంగా.

"ఇదిగో! కోపం మనకెందుకే? కోపం రావాలంటే మజాకా అనుకున్నవా? ఎంత దన్నుండాల! పేదోడి కోపం పెదవికి చేటు. మన కోపం మన్ని పామై కాటేస్తది. అమ్మ అక్కర తీరినోడికి బతుకు బారెడనిపిస్తది. కాలం కరగదు. అన్నీ అమరినోడికి బతుకు చానా చిన్నది. పొద్దు పొడుస్తదో కూకుతదో తెలీదు. మనకు బతుకులో తెలిసిన నిజమిది. అది పసికందు.

లోకం తెల్సింది మొదలు మనబోటి వాళ్లకు అన్నీ కట్టాలే గదనే - ఇదిగో నా మాట ఇను - మొన్న 'తాతా! చందమామ తెస్తవా' అన్నది."

"ఇప్పుడు కళ్ల కలకలు మోపుగ ఉన్నయి, బిడ్డా! నయమయినంక తెచ్చిస్త అన్న. ఇది జరిగేడిది కాదని నాకు తెలీదటే? తెల్సు, కానీ అది పసిది. కనపడిందల్లా కావాలంటుంది. అందుకే నేను తెచ్చిస్తనన్నదీ. దానికెంత సంబరమైందో తెల్సునటే? దీపంలా ఎలిగిపోయింది మొఖం. ఇగో చందమామ కావాలా! 'చంపుత' అంటే? అమ్మీ! దాని మనస్సు నొప్పిచ్చకే. నువ్వు ఎన్నేళ్లు ఏంజేసి దాని కేమిస్తవే పిచ్చిమొఖమా! తెలియని తనంలోనైనా కలలలో తిరుగాడియ్యవ్. ఇగో నా కిప్పుడు నూరో పడి నడుస్తంది. అర్వై నుంచి ఇట్టనే బతుకీడుస్తున్న. నా పక్కన ఉన్నోళ్ల కండ్లలో ఎన్ని 'కలలు' చూసిన. ఎన్నెన్ని ఆశలు! అవేవీ నిజాలు కాలేదు. కావని నాకూ తెల్సు. కానీ తృప్తి పడే ఆ ఒక్క నిముషాన్ని చెడపకు! ఇక మన బతుకులంటావు? తలచుకుంటే చాలు, కండ్లు చెరువులవుతయి. గుండె విలవిల మంటుంది. దాన్నేమీ అనకు! పసిదే!" అంటూ ఆగక సణుగుతూనే ఉన్నాడు.

ఈమె ఇంత వండి, బిడ్డకింత పెట్టి, తనింత తిని 'తాత ముందింత ఉంచి, 'ఇగో, తిని పడుకో!' అని బిడ్డ సరసన ముడుచుకుంది.

కొద్దిసేపట్లోనే, "అమ్మా! నిద్రొస్తున్నది" అంది సుమిత్ర.

"సర్లే పడుకో!" అంది.

పక్కన పడుకుని బిడ్డను జోకొట్టింది. జోకొడుతూనే దగ్గరకు జరుపుకున్నది. అలా జరుపుకుంటుంటే, అమ్మ గుర్తుకు వచ్చింది.

గుండె కదిలింది.

కళ్లెంట నీరూరి చెంపల మీదకు జారినయి.

తుడుచుకోవాలనిపించలేదు.

పెదాల దాకా జారి ఉప్పంగ తగిలినయి.

"అమ్మా!"

"అమ్మా!!"

"అమ్మా!!!" అని గొంతెత్తి మనసారా పిలవాలనిపించింది.

అమ్మలోకి జరిగి ముడుచుకుని పడుకోవాలనిపించింది.

అమ్మలో కలిసి పోవాలనిపించింది.

అమ్మ దేవత!

నాన్న తాగుబోతు.

నిత్యం తప్పతాగి అపరాత్రి ఇంటికి చేరేవాడు.

తలుపులు తీసి ఉంచితే తప్పు.

వేసి ఉంచితే తప్పు.

అన్నం పెడితే తప్పు.

"తిన్నవా?" అని అడిగితే తప్పు.

ఏదో ఒక వంక దొరకడమే ఆలస్యం.

జుత్తు చేత లంకించుకుని దొంగ గొడ్డుని కసిగా బాదినట్టు బాదడం, ఎగిరెగిరి తన్నడం చేస్తూంటే ఉలిక్కిపడి లేచి, కనిపిస్తున్న కిరాతకం అకస్మాత్తుగ కళ్లబడడంతో -

బిత్తరపోయి, చిత్తరువులాగయి

"అమ్మా! అమ్మా!" అని గుండెలవిసిపోయేలాగ ఏడుస్తుంటే -

అతగాడు సొక్కి, ఊరుకున్నాక

దగ్గరకొచ్చి గుండెలకు అదుముకుని ఓదార్చేది.

అమ్మ నోదార్చే దెవరు?

ఏడుపు దిగమింగుకుంటూ కూర్చునేది.

ఒకనాడు ఏమయిందో, ఏమో -

అమ్మను అమాంతం ఎత్తి వరండాలోకి విసిరేశాడు.

అడ్డదిడ్డంగా పడి, స్పృహను కోల్పోయింది. ఆ తరువాత ఏం జరిగిందో తెలీదు.

ఎందుకిలా చేశాడో తెలీదు.

ఆలిగా చేసుకున్న ఆడదానిపై ఉండే హక్కు ఇలాంటిదా?

తనకు మగత వచ్చింది. కళ్లు తెరిచేసరికి అమ్మ ఒడిలో ఉంది.

అమ్మ ఉంది.

"అమ్మా!" అంటూ కడుపులో ముడుచుకు పోయాను. కడుపుమీద కూడా కముకు దెబ్బల జాడ తగిలి లేచాను. ఒళ్లంతా దద్దుర్లే !

రక్కులు

గాయాలు

అమ్మను సరిగ్గా చూశాక భయంతో బిగిసి పోయాను.

"అమ్మా! ఇక్కడొద్దు, ఎటైనా పారిపోదాం!" అన్నాను ఏడుస్తూ.

అంత బాధలోనూ -

అమ్మ మమకారం

ఆప్యాయత

కోట గోడలా ఉండేది.

అలాంటి అమ్మను ఆ రాత్రి తాగి, తూలుతూ వచ్చి, ఆయనకు కావల్సిన రీతిలో కూరలు వండలేదని దొరికిన కట్టెతో విసిరి కొడితే

అది అమ్మ కణతన తగిలింది. వెర్రి కేక వేసి కిందపడింది.

రక్తంతో నేల తడుస్తోంది.

తండ్రి అన్న వాడేమైనా చేస్తాడేమో?

అమ్మను ఆదుకుంటాడేమోనని చూస్తే,

"చావు!..." అంటూ కసిగా తిట్టుకుంటూ కక్షగా ఓ తన్ను తన్ని మరీ గడప దాటిండు.

ఆ క్షణం నేను జీవితంలో మరచిపోలేనిది, మరపు రానిది.

మనిషి అంటే మగవాడేనా?

ఆడది మనిషి కాదా? అయితే ఏమిటి?

కలసి సంసారం చేసే స్త్రీ ఇంత బానిసా?

ఆట వస్తువు కంటే కనా కష్టమైనదా?

నా పరిస్థితి ఇలా ఉందేం? అని ఎప్పుడూ ఆలోచించరా?

ఎంత ఆలోచించినా ఈ నికృష్ట సమాజంలో ఇంతేననుకుని, ఆడదానిగా పుట్టిన శాపానికి ఇలా బతు కీడుస్తున్నదా?

ఆది పరాశక్తి అని పూజలు చేస్తారే, మరి ఈ స్థితి ఏమిటి?

ఎందుకు?

ఆది శక్తి నుంచి ఈ స్థితికి ఎలా దిగజారింది?

వస్తువును ప్యాక్ చేసుకున్నట్టు మనుషులకు నిండు బురఖా లేమిటి?

ఆ గర్భాన పుట్టి, ఆ స్తన్యం తాగి, ఆవిడచేత గోరు ముద్దలు తిని, ఆవిడ నేర్పిన మాటలతో తెలివిపారి ఆవిడనే ఆటబొమ్మగా నిలబెట్టడం ఉందే?

ఇది మనుష్య ప్రపంచానికి ఎంతటి మచ్చో - చెరగని మరకో ఆలోచించక నిమ్మకు నీరెత్తినట్టుగా నడుస్తున్నారేం?

ఎంత తలబద్దలు కొట్టుకున్నా అర్థం కాదు.

నా స్థితి ఆ క్షణాన అసలేమీ అర్థం కాలేదు.

"అమ్మా!" అంటూ ఆవిడపై పడివాటేసుకున్నాను. అప్పటికే ఆవిడలో చలనం పోతోంది, పోయింది కూడా.

అమ్మ చనిపోయిందని పూర్తిగా తెలిశాక అంత దుఃఖంలోనూ అంతులేని సంతోషం మెదిలింది.

ఇక్కడి కష్టాలకు శాశ్వతంగా దూరమైంది కదా!

వెళ్లిన చోట సుఖం ఉన్నా, లేకున్నా ఈ నిత్య నికృష్టపు స్థితి ఉండదు కదా!

పోయిన నా కన్నతల్లి కోసం నేను ఎంతో కాలం ఏడవక మునుపే, నా కంటి తడి పూర్తిగా ఆరక మునుపే-

నా తాగుబోతు తండ్రితో మరో 'అమ్మ' ఇంటిలో కొచ్చింది. ఇంత భ్రాష్టుడని తెలిసినాక కూడా కని, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులు ఇతనికెలా పట్టించారో అర్థం కాదు, కాలేదు.

ఒక భార్యను చేతులారా చంపాడనీ తెలుసు.

ఆవిడకు బతికినంత కాలం నిత్యం నరకం చూపాడనీ తెల్సు.

అయినా మెడకో పసుపుతాడేసి తోలే స్థితికి ఈ సమాజం ఎందుకొచ్చింది?

ఆడవాళ్లకే పెళ్లిళ్లు కాకపోవడమేమిటి?

ఆడమనిషికి మగవాని అవసరం ఎంతో మగవానికీ ఆడమనిషితో అవసరమూ అంతే కదా!

పైగా సమాన హక్కులంటున్నాయి ప్రభుత్వాలు, స్వాతంత్ర్య మంటున్నాయి.

ఇంకేవేవో ఉట్టి నుంచి స్వర్గధామంలోకి చేర్చినట్టు చెప్పలేక చస్తున్నారు. ఏమిటీ ప్రదర్శన?

అసలిది మనుష్య సమాజమేనా?

కన్నతల్లిని పశు పక్ష్యాదులు వదలవు - ఈ మగవాడి స్థితేమిటి? ఎందుకీ స్థితి దాపురించింది?

కన్నది తల్లిదండ్రులే కదా! కలసి కన్నదే కదా! తల్లికీ, తండ్రికీ ఉన్న ఈ అంతర మేమిటి?

ఏమీ లేనట్టూ, అంతా సమానమే నన్నట్టూ చెపుతున్నారేం?

కొత్తఅమ్మతో 'కలిమి' నెల రోజులు సాగింది.

ఒక పొద్దు చెంప పేలిపోయింది. ఇదేమిటని బిత్తరపోయి, నోరు మెదపబోతే, మరో తాపు బలంగా తగిలింది.

గింగరాలు తిరిగి పడిపోయి ఉగ్గపట్టి ఏడ్చింది.

'చనువిస్తే చాలు, నంజలు నెత్తిన ఎక్కుతారు!' అనుకుంటూ గడపదాటాడు.

అది మొదలు పాతరకం వేధింపు పునః ప్రారంభమైంది.

ఒకనాటి పొద్దు పొడుపున 'పిన్ని' కనిపించలేదు.

ఊరి దాపుల్లోని, చెరువులలో, బావులలో ఆవిడ శవం తేలలేదు. అంటే -

ఈ బతుక్కంటే చెడిపోవడమేముంటుందని ఎటో వెళ్లి పోయింది.

నాన్న పాపం, తాగుడు మానుకుని నాల్గు రోజులు వెతికాడు.

ఆవిడ దొరకదని అర్థమవగానే మరో అమ్మ!

ఏడాది తిరుగుతుండగనే నల్గురు 'అమ్మ'లు వచ్చి, శపిస్తూ వెళ్లారు. అయినా ఇతని బతుకు చెడలేదు!

చెడేది మాత్రం ఏముంది గనుక?

లోకం మాత్రం ఈ పరిస్థితి అంతా తెల్సినాక కూడా వెళ్లిపోయిన వారినే చెడిపోయారన్నారు.


"ఎంత మగవాడు - ఇలా పారిపోవడమేనా? సంసారం అన్నాక తిట్టకొనకా, కొట్టుకొనకా ఉంటారా" అని నాన్నపైనే సానుభూతి వర్షం కురిపించారు.

ఏదో పడరాని కష్టం ఆయన పడిపోతున్నట్టు! నిజంగా అప్పుడు తెలిసింది నాకు. మా 'అమ్మ' భరించిన కష్టం ఎంతో! అంత హాలాహలాన్నీ మింగటానికి పరమేశ్వరుడు పడిన దానికన్న కష్టమని.

మళ్లీ ఒకదాన్ని తెచ్చాడు.

"మగాడు, వానికేం?" అన్నారు సాక్షాత్తు ఆడంగులు.

మగవాడిగా పుడితే చాలు, ఇట్లాంటి ఏ తప్పైనా



చేసే హక్కు ఉంటుందని, ఎందరాడాళ్లనైనా, నాయనలా చెండాడుకు తినవచ్చని!

అసలీ మగాడంటే ఎవడు?

మగాడు అంటే ఏమిటి? అన్న ప్రశ్న మొలిచింది నాలో.

తలపోటు పుట్టింది గానీ, ఈ భ్రష్టుడు అర్థం కాలేదు.

చివరకు ఇదో 'అర్థం గాని వింత మృగం' అనుకని, ఆలోచనను కట్టేశాను. ఎందుకంటే, శరీరంలో నాన్నకన్న శక్తి ఉన్న ఆడది కూడా ఆయన్ను ఎదురు తిరిగి తన్నలేదు! పైగా, ఏడ్చి మొత్తుకుని, బేలగా మారి, కట్టు బానిసల్లా పడి ఉన్నారు!

మూలుగులు పుచ్చిపోయేలా విరగదన్నినా, ఆ వెంటనే మంచమెక్కమంటే గజగజ వణుక్కుంటూ ఎక్కి, ఒళ్లు సంపూర్ణంగా అప్పగించి-

అతని పని తీరగానే దిగిపొమ్మంటే, నేలపై ఉన్న చింకి చాప మీదకి మారేవారు.

ఇదీ అర్థం కాలేదు నాకు!

నన్ను 'రామనాథం' అనేవాడు ఒక తూరి కలిశాడు.

ప్రేమించానన్నాడు. పెండ్లాడతానన్నాడు. వాడు మాట్లాడింది విన్నాక, మగాడితో పెండ్లేమిటి? తన్నులు తినడానికా, బానిసగా బతికేందుకా అని భయమేసింది.

"నాకు పెండ్లి చేసుకోవాలని లేదు" అన్నాను.

మళ్లీ అడిగాడు నెల తరువాత.

నన్ను వదిలెయ్యమన్నాను. ఇక నా దగ్గర ఈ ప్రసక్తి తేవద్దని చెప్పాను.

అయినా నా పెండ్లి అయింది - పైగా, రామనాథంతోనే.

నాన్నగా ఉన్న కిరాతకుడు 'రామనాథంతో నీ పెండ్లి' అని గుడ్లురుమాడు.

నేను మాట్లాడలేదు.

"నేను మాటన్నాను! - నీ శవం మీదికైనా తాళి కట్టాల్సి వస్తే రామనాథమే కడతాడు!" అన్నాడు.

ఆ రాక్షసత్వం ముందు ఒక ఆగేదేముంటుంది?

"నాన్నా!" అని ఏడ్చాను.

"పెండ్లి చేసుకో!" అంటూ వెళ్లిపోయాడు.

కాపురాని కెళ్లాను , భయం భయంగా!

కానీ "మగాడంటే ఇలా ఉంటాడా? నాన్నలా కాదన్నమాట" - అనిపించింది.

కొత్తలో రోజా పూలు తెచ్చి, పూవులా చూసుకునేవాడు.

అతగాడు పొందాల్సిన సుఖాలు నన్ను హింసించకుండా పొందాడు.

నెల తప్పింది.

భర్తకు చెప్పే ఆనందదాయకమైన విషయం కదా! పక్కలో ఉండగానే గుసగుసగా చెప్పాను.

"ఇప్పుడేం కడుపు?" అన్నాడు.

ఉలిక్కిపడి పక్కకు జరిగాను.

తెల్లవారి అడిగాను, 'ఏం చేయమంటారు?' అని.

"తీసేయించుకో!" అన్నాడు - కాలికి ముల్లు తగిలితే పిన్నీసుతో తీసేసినంత తేలికగా.

"నాకు తెలియదు!" అన్నాను ఇష్టం లేక.

"నే చెప్తాను కదా!" అన్నాడు అదోలా నవ్వి.

ఈ క్కటీ ఉంచుకుందామేం?" అన్నాను బతిమాలుతున్నట్టు.

"అక్కర్లేదన్నాను కదా! నాలుగు మాటలు నాకు రావు!" అన్నాడు.

తోడేలు లక్షణాలు అప్పుడే కొద్దిగా కనిపించాయి.

అలా ఆరుసార్లు - ఆరిపోయిన సిగరెట్టు పీకను విసిరి పారేసినంత తేలికగా గర్భం తీసేయించాడు.

అలా తీసేయించిన రోజే ఒకసారి తాగి వచ్చి మంచమెక్కాడు.

"ఇదేంటి?" అన్నాను బాధగా.

"ఇదింతే" అన్నాడు మీదకొస్తూ.

ఈ పరిస్థితి తట్టుకోలేక - ఒకనాడు "మీరు పిల్లలు కలగకుండా ఆపరేషన్ చేయించుకోండి, లేదా నాకు చేయించండి" అనడిగాను.

నా చెంపపై అయిదువేళ్లూ అచ్చులా పడినయ్.

నేనేం తప్పు మాట్లాడానో బొత్తిగా అర్థం కాలేదు.

పైగా "నేను చాలడం లేదా?" అంటూ లేచిపోయాడు.

ఇదేం మాటో నాకు తోచలేదు.

అది మొదలు నా శరీరంతో పశువులా, రాక్షసంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు.

ఆ నరకం ఇక ఎంతోకాలం భరించలేనేమో ననిపించింది.

పొద్దు వాలుతుంటే భయం ప్రారంభమయ్యేది.

ఈలోపు మళ్లీ నెల తప్పింది.

ఇది చెప్పడం ఎలా?

చెపితే అసలు బతకనిస్తాడా?

రోజులు గడుస్తున్న కొద్దీ వణుకు ప్రారంభమైంది.

దిక్కులేని పరిస్థితిలో అతగాడు ఊరు విడిచి కోర్టు పనిమీద టౌను కెళ్లినప్పుడు పారిపోయాను.

మగాడనేవాడికి అందనంత దూరం!

అక్కడ ఓ భిక్షగాడు ఇంత ఆసరా ఇచ్చాడు.

కాకపోతే, నాపైన జనానికి జాలి కలిగేందుకు గాను ఎడమ చెయ్యి వెనక్కి పెళుక్కున విరిచాడు. వంకరగానే అతుకేలా చేశాడు.

ఏం చేసే స్థితీ లేక, ఏ ఆసరా లేక దిక్కుమాలి అతని పంచనే కన్నదాకా పడి ఉన్నాను.

ఆడపిల్ల పుట్టింది.

ఆడదని తెలియగానే అంతుమాలిన ఏడుపొచ్చింది.

దీన్ని బతకనిచ్చి బతుకంతా ఏడిపించే బదులు చంపేద్దామనిపించింది.

ఆ నిర్ణయమే సరైనదనుకున్నాను కానీ, నా చేతులతో చంపలేక పోయాను.

కనీసం పారేయలేక ఏడుస్తూ కూర్చున్నాను.

ఆడదాని ఈ బలహీనతే మగవానికి కట్టు బానిసను చేసిందేమో?

అయితే, ఇంకా ఆ భిక్షగాని వద్దనే ఉంటే ఈ పసిదాని అవయవాన్నొకదాన్ని వంకర చేసి, జాలి పడేలా చేస్తాడని భయమేసి ఒకానొక అర్థరాత్రి బిడ్డతో పారిపోయి బయట పడ్డాను.

అప్పటి నుంచి, ఈ 'తాత' ఆసరా దేవుడిలా దొరికింది.

మగజాతంతా ఇంతే అనుకునే తరుణంలో ఈ 'తాత' - ఈయనదీ మగపుటుకే కదా! అయినా కవచంలా కాపాడుతూ వచ్చాడు.

తండ్రి ప్రేమనిచ్చాడు.

"అమ్మీ ! సుమిత్ర నిద్రోయిందే! ఇంకా జోకొడతావెందుకూ? నిద్రలోకి జారబడేంతవరకేనే జోకొట్టడం! నిద్రలో కెళ్లాక జోకొడితే పిల్లదానికి మెలకువ వస్తది! ఉలిక్కి పడి లేస్తది!" అన్నాడు తాత నవ్వుతూ.

"అట్టాగే" అంటూ దగ్గరకు జరుపుకుని పంచె గుడ్డను దానికి కప్పిం, మీద చెయ్యేసి, కళ్లు మూసుకుంది నిశ్చింతగా!

'ఏమి జన్మంబేమి జన్మంబు' అన్న తత్త్వం లీలగా వినిపిస్తోంది.

"తాత' పెదవులు అలవోకగా వంకర్లు తిరిగినయ్ !



**తిరగబడలేదేం?**

సినిమా హాల్లో కథ మాంచి రస పట్టులో సాగుతోంది. ప్రేక్షకులు ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. ఉన్నట్టుండి హీరో హీరోయిన్ని ఛెళ్లుమని చెంపదెబ్బ కొట్టాడు.

నిశ్శబ్దంగా వున్న సినిమా హాల్లో ఒక కుర్రాడి గొంతు వినిపించింది.

"మమ్మీ! ఆ అమ్మాయి పడి ఎందు కూరుకుంది? నువ్వు నాన్నని తన్నినట్టు తిరగబడ తన్నదేం?"